ప్రజాశక్తి

బుధవారం 30 జులై 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

జలాశయాలకు పెరిగిన ప్రవాహం

సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజిలకు భారీగా వరద నీరు - సాగర్ నుండి దిగువకు విడుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి





ఉమ్మడి జిల్లాలో జలాశయాలకు నీటి ప్రవాహం పెరిగింది. మంగళవారం కృష్ణాతీరంలో జళకళ సంతరించుకుంది. శ్రీశైలం నుంచి 2,91,229 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయగా నాగార్జున సాగర్‌కు 2,58,111 క్యూసెక్కుల నీరు వస్తోంది. సాగర్ నుంచి 2,48,215 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఇందులో పులిచింతలకు 2,18,473 క్యూసెక్కుల నీరు వస్తోంది. పులిచింతల నుంచి దశల వారీగా ప్రకాశం బ్యారేజికి నీటి విడుదలను పెంచుతున్నారు. మంగళవారం రాత్రి పులిచింతల నుంచి దాదాపు 70 వేల క్యూసెక్కులు ప్రకాశం బ్యారేజికి విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం కల్లా ప్రకాశం బ్యారేజి గేట్లు కూడా పూర్తిగా ఎత్తి నీటిని దిగువకు చేసే అవకాశం ఉంది.

రెండ్రోజుల్లో పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజికి 3 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కృష్ణాతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నాగార్జున సాగర్ జలాశయం దాదాపుగా నిండగా పులిచింతల జలాశయం రెండు రోజుల్లో నిండుతుందని అంచనా వేస్తున్నారు. పులిచింతల గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 31.16 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ఇంకా 10 టిఎంసిలు నీరు చేరితే పులిచింతల నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో కృష్ణా తీరానికి వరద బెడద పెరిగే అవకాశం ఉంది. శ్రీశైలం నుంచి ఇదే ప్రవాహం మరో రెండ్రోజులు కొనసాగితే కృష్ణాతీరంలోని పలు గ్రామాలకు వరద ముంపు ఏర్పడే అవకాశం ఉంది.

బుగ్గవాగుకు వరద నీరు వచ్చి చేరుతోంది. బుగ్గవాగు నీటి నిల్వ సామర్థ్యం 3.46 టిఎంసిలు కాగా ప్రస్తుతం 2.02 టిఎంసిల నీటి నిల్వ ఉంది. బుగ్గవాగుకు ఎగువ నుంచి 4,500 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 2,597 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద నీటి నిల్వ సామర్థ్యం 3.07 టిఎంసిలు కాగా ప్రస్తుతం 3.04 టిఎంసిల నీటి నిల్వ ఉంది. దీంతో ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. జిల్లాలో జలాశయాలకు నీటి నిల్వలు భారీగా పెరగడం, ఎగువ నుంచి ప్రవాహాలు కొనసాగడం వల్ల పంట కాల్వలకు నీటి విడుదలను అధికారులు పెంచారు. సాగర్ ఆయకట్టు పరిధిలో కుడి, ఎడమ కాల్వలకు 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో తెలంగాణ పరిధిలోని ఎడమ కాల్వకు 20 వేల క్యూసెక్కులు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో కుడి కాల్వకు 7,500 క్యూసెక్కులు, కృష్ణా జిల్లాలోని ఎడమ కాల్వకు 2,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి నుంచి డెల్టా కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 7500 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా అదనంగా వచ్చిన 13,071 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. కాల్వలకు మరమ్మతులు ఇంకా పూర్తి కానందున కొన్ని ప్రాంతాల్లో స్వల్పంగానే నీటి విడుదల చేస్తున్నారని తెలిసింది. మొత్తంగా ఈ ఏడాది జులై చివరి వారంలోనే జలాశయాలన్నీ నిండిపోయి నీటిని దిగువకు విడుదల చేయడం వల్ల ఖరీఫ్ సేద్యానికి నీటి ఎద్దడి తొలగిపోయింది. దాదాపు 40 రోజులు పాటు ఖరీఫ్ సాగు ఆలస్యమైనా ప్రస్తుత జల ప్రవాహం, ఇటీవల వర్షాలతో కలిపి సాగుకు సానుకూల పరిస్థితులు పెరిగాయి.

దోపిడీ కోసమే స్మార్ట్ మీటర్లు

వీటికి వ్యతిరేక ఆందోళనల్లో ప్రజలంతా కలిసి రావాలి : సిపిఎం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్మార్ట్ మీటర్లు వినియోగదారులను తీవ్రంగా దోపిడీ చేస్తాయని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. దుగ్గిరాలకు మంగళవారం వచ్చిన ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన టిడిపి ఇప్పుడు అదే మీటర్లను ఏర్పాటు చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే ప్రజలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ భారాలు అదనంగా వేశారని అన్నారు. ప్రారంభంలో ప్రభుత్వ కార్యాలయాలకు పరిమితం అవుతుందని చెప్పినా ఇప్పుడు ఇళ్లకు కూడా ఏర్పాటు చేస్తున్నారని, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో వీటిని పెడుతున్నారని అన్నారు. అనంతరం గ్రామీణ ప్రాంతాలకూ విస్తరింపజేస్తారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తర్వాత వ్యాపార సంస్థలకు అసాధారణంగా అధిక బిల్లులు వస్తున్నాయన్నారు. మీటర్లను బలవంతంగా ఏర్పాటు చేయొద్దనే విద్యుత్ శాఖ మంత్రి వాగ్దానాలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేదని విమర్శించారు. మీటర్ల ఖర్చును కూడా ప్రజల నుండే వసూలు చేస్తారని, విద్యుత్ ధరలు సైతం వేర్వేరుగా ఉంటాయని, ఇవన్నీ ప్రజలపై మోయలేని భారమవుతాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా 5, 7 తేదీల్లో జరిగే నిరసనల్లో ప్రజలంతా పాల్గొనాలని, మీటర్లు వద్దంటూ సంతకాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, నాయకులు జె.బాలరాజు, వై.స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టైల్‌పాండ్ 14 గేట్ల ద్వారా పులిచింతలకు నీరు

ప్రజాశక్తి - రెంటచింతల



మండలంలోని సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న నాగార్జునసాగర్ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో డ్యామ్‌కు ఉన్న 20 గేట్లకు గాను 11 గేట్లు 3.5 మీటర్లు, 3 గేట్లు 2.5 మీటర్ల మేర ఎత్తి 2,38,727 క్యూసెక్కుల నీరు రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి అనంతరం టైల్ రైస్ ఛానల్ ద్వారా 7600 క్యూసెక్కుల నీరు మొత్తం 2,46,327 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.08 ఎంయుల విద్యుత్ తయారైంది. ప్రస్తుతం రిజర్వాయర్లో 6.704 టీఎంసీల నీరు ఉండగా ఈ నీరు 74.95 మీటర్లు అంటే 247.7 అడుగులకు సమానం. ప్రాజెక్టు ప్రారంభమైన తరువాత తొమ్మిదేళ్లలో జులై నెలలో గేట్లు ఎత్తడం ఇదే ప్రథమం ప్రాజెక్టు ఎస్ఇ వెంకటరమణ ఈఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటల నుండి విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేశామన్నారు.



పొగాకు కొనుగోలు కేంద్రం కోసం ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - పెదనందిపాడు

పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పెదనందిపాడులోనూ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బి.రామాంజనేయులుకు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, నాయకులు కె.వెంకటశివరావు, డి.రమేష్‌బాబు, ఎం.వెంకటేశ్వర్లు, జె.రామారావు, ఎన్.రాజేంద్ర మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని 17 గ్రామాల్లో పొగాకు సాగు చేశారని, పొగాకును అమ్ముకోవడానికి గుంటూరు తీసుకువెళ్లడానికి రైతులకు రవాణా ఛార్జీలు అధికమవుతున్నాయని చెప్పారు. మండలంలో 70 శాతం పొగాకు ఇంకా రైతుల వద్దే ఉందని, కొనుగోలు కేంద్రాన్ని సత్వరం ఏర్పాటు చేసి కొనుగోళ్లను వేగవంతం చేయాలని, క్వింటాళ్‌కు రూ.12 వేల ధర ఇవ్వాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి

పంటన్నీ బీమా చేయించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

పంటలు సాగు చేస్తున్న రైతులందర్నీ ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన ద్వారా పంటల బీమా చేయటానికి వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, బ్యాంకర్లు, క్షేత్రస్థాయి ఉద్యోగులను సమన్వయం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ ఆదేశించారు. ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకం, కౌలు రైతులకు పంట రుణాల మంజూరుపై బ్యాంకర్లు వ్యవసాయశాఖ అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మిర్చి, వరి, తదితర పంటలు సాగు చేస్తున్న 3,48,933 మంది రైతులకు బ్యాంకర్లు పంట రుణాలు మంజూరు చేశారని చెప్పారు. వీరిలో మిర్చి సాగు చేస్తున్న రైతుల వివరాలను ఈనెల 31వ తేదీలోపు, వరి సాగు చేస్తున్న రైతుల వివరాలను వచ్చేనెల 15వ తేది నాటికి బ్యాంకర్లు ఇన్సూరెన్స్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పంటల

▶ 2లో



రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు

ఆమోదం తెలిపిన జిఎంసి స్టాండింగ్ కౌన్సిల్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో రూ.21 కోట్లతో వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులకు స్థాయిసంఘం ఆమోదం తెలిపింది. స్థాయి సంఘం అధ్యక్షులు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన జిఎంసి ప్రధాన కార్యాలయంలో నగర కమిషనర్‌తో కలిసి స్థాయి సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. వివిధ డివిజన్ల ప్రజాప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన 63 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులను స్థాయిసంఘ సభ్యులు, విభాగాధిపతులతో చర్చించి, ఆమోదం తెలిపారు. మేయర్ మాట్లాడుతూ జిఎంసి ఆదాయం పెంపొందించటానికి నగర

▶ 2లో

అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే ప్రవీణ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పులిచింతల నుండి దిగువకు వరద నీటిని విడుదుల చేస్తున్న నేపథ్యంలో అచ్చంపేట,అమరావతి మండలాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. ఈమేరకు మంగళవారం అధికారులతో మాట్లాడారు. నాగార్జున సాగర్ బ్యారేజి గేట్లు ఎత్తడంతో కృష్ణానది దిగువకు వరద నీరు వస్తుందని నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న ఎమ్మెల్యే సూచించారు. అధికారులకు ఫోన్‌లు చేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులను అప్రమత్తం చేస్తూ పలు సూచనలు చేశారు. వరద ముంపు వల్ల ఎటువంటి నష్టం లేకుండా చూడాలన్నారు.

టిడ్కో గృహాసముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం టిడ్కో అధికారులతో జిఎంసి ప్రధాన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెళ్లపాడు, వెంగళాయ పాలెంలోని టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. త్రాగునీటి, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి జిఎంసి, టిడ్కో అధికారులతో కలిసి పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నగరపాలక సంస్థ పిజిఆర్ఎస్ ఇతర వేదికల ద్వారా టిడ్కో ఇళ్లకు సంబంధించి ప్రజల నుండి పలు అర్జీలు అందుతున్నాయని, వాటిని టిడ్కో, జిఎంసి అధికారులు సమన్వయంతో పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం నగర పరిధిలో కేటగిరిల వారీగా టిడ్కో ఎన్ని గహాలు మంజూరు అయ్యాయి, ఎంత మంది నివాసం ఉంటున్నారు, ప్రధాన సమస్యలపై టిడ్కో అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వరశాస్త్రి, ఉపా సెల్ పిఓ జె.రామారావు, టిడ్కో డిఈఈ సేతుబాబు, టిడ్కో కోఆర్డినేటర్ సుధాకర్, ఏఈ వేణు పాల్గొన్నారు.

మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ కిషోర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాజీ శాసనసభ్యులుపిన్నెలి రామకష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మాజీ మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిశోర్ కు సుప్రీంకోర్టులో మంగళవారం ఎదురుదెబ్బ తగిలింది.రిట్ పిటిషన్ విచారణ స్వీకరణ కు నిరాకరిస్తూ ధర్మాసనం డిస్మిస్ చేసింది. తనపై ఇక ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకుండా ఆదేశాలివ్వాలని కిశోర్ న్యాయవాది ద్వారా సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దకలు చేశారు. రిట్ పిటిషన్ విచారణకు స్వీకరించడానికి నిరాకరిస్తూ జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా కూడిన సుప్రీమ్ కోర్టు ధర్మాసనం రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశ క్తి- తాడేపల్లి

రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. తాడేపల్లి లోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో కమిషనర్ లావణ్య వేణి కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ శాఖ వసతి గృహాలలో చదువుతున్నటువంటి విద్యార్థులు దయనీయ మైనటువంటి స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలని కోరారు. అదేవిధంగా సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో శిథిలావస్థలో ఉన్నటువంటి బిల్డింగ్ లో ఉంటూ భయభ్రాంతులతో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వార్డెన్, కమాటి, కుక్, వాచ్మెన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్. మహర్షి, రాష్ట్ర కార్యదర్శి ఐ. రాజేష్ పాల్గొన్నారు.

రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు

(మొదటి పేజీ తరువాయి)

పాలకసంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీలు ఉన్న వాటికి బహిరంగవేలం నిర్వహించి, షాపులను కేటాయించినట్లు చెప్పారు. వార్డుల్లో అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం స్థానిక కార్పొరేటర్లకు ముందస్తు సమాచారం అందించి ఆహ్వానించాలని చెప్పారు. మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులను పార్టీలకతీతంగా చేపడుతున్నామన్నారు. నగరంలోని శివారు ప్రాంతాల్లో ఆభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నామన్నారు. విలీన గ్రామాల్లోనూ సిసి డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక ఆమోదం తెలిపామన్నారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మి దుర్గ, ముప్పవరపు భారతి, సెక్రటరీ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, జిఎంసి విభాగాధిపతులు పాల్గొన్నారు.

పంటన్నీ బీమా చేయించాలి : కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

బీమా పథకంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగేలా రైతుసేవా కేంద్రాల ద్వారా బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు ప్రచారం కల్పించాలన్నారు. పంటల బీమా పథకానికి మరింత మంది రైతులను నమోదు చేయటానికి వీలుగా ప్రస్తుతం ఉన్న గడువును పొడిగించేలా వ్యవసాయశాఖ అధికారులు ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా ప్రతిపాదనలు అందించాలన్నారు. సిసిఆర్‌సి కార్డులు జారీ చేసిన కౌలురైతులందరికీ బ్యాంకర్లు పంటరుణాలు ఇవ్వాలని కోరారు. కౌలురైతులకు లక్ష్యం మేరకు నూరుశాతం పంట రుణాలు అందించేలా వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకర్లతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జెసి భార్గవ్‌తేజ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, యూనియన్ బ్యాంక్ డీజీఎం జవహర్, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్‌రెడ్డి, ఉద్యాన శాఖాధికారి రవీందర్, బ్యాంకర్లు, ఇన్సురెన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా

పగటిపూట సరఫరాకు చర్యలు : సిఎస్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. పొన్నూరు మండలం నిడుబ్రోలు సబ్ స్టేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మంగళవారం పరిశీలించారు. సబ్ స్టేషన్ నుంచి వ్యవసాయ, వ్యవసాయేతర సర్వీసుల వివరాలు, సామర్థ్యం, ఏయే గ్రామాలకు సరఫరా, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఆయన అధికారులతో సమీక్ష చేశారు. వ్యవసాయ, వ్యవసాయేతర లైన్లకు సంబంధించిన విభజన గురించి చర్చించారు. ఫీడర్‌లను విభజనపై అధికారులు విజయానంద్‌కు వివరించారు. గుంటూరు, బాపట్ల జిల్లాలలో వున్న అన్ని ఫీడర్లలో వున్న వ్యవసాయ , వ్యవసాయేతర సర్వీసులు వేరు చేస్తున్న ఫీడర్ బైఫర్ కేషన్ పనులను 3 నెలలలోగా సెప్టెంబర్ చివరకు పూర్తి చేసి గ్రామాలకు 24 గంటల నిరంతరాయంగా నాణ్యమైన 3 ఫేజ్ విద్యుత్ ను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. దానికి సంబంధించిన పనుల న్నిటిని ప్రోగ్రాం చేయడం జరిగిందని, సెప్టెంబర్ కు మొత్తం గ్రామాలను పూర్తి చేసి 3 ఫేజ్ కరెంట్ సప్లై చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం వడ్డెముక్కల గ్రామానికి 3 ఫేజ్ విద్యుత్ సరఫరా పూర్తి అయిందని , వ్యవసాయానికి పగటిపూట నిరంతరం 9 గంటలు నాణ్యమైన విద్యుత్ ను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా మెయింటెనెన్స్ పనులు చేయడంతో పాటు వాటిని రికార్డు చేయాలని, ప్రజల మన్ననలు అందుకునేలా సిబ్బంది ఏమరపాటు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర, సిపిడిసిఎల్ చైర్మన్ పుల్లారెడ్డి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, విద్యుత్ శాఖ అధికారులు లింగమూర్తి , టీవిఎస్ ఎన్ మూర్తి, మురళి కష్ణ యాదవ్, ఎలక్ట్రికల్ భాస్కరరావు, మల్లిఖార్జున రావు,రాజేష ఖన్నా, వెంకటేశ్వరరావు, ఏఇ శంకరరావు, తహశీల్దార్ జయా ఉల్ హక్, యంపిడిఓ శ్రీనివాస్, మున్సిపాల్ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ , విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి పట్టణంలో ఎల్‌వోసీ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణం 15వ వార్డుకు చెందిన రాపూరి వినోద్ కుమార్ కుమారుడు ఆదిత్య విజయవాడలోని అనురాగ్ పిల్లల హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు. రాపూరి వినోద్ కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితి గురించి స్థానిక నాయకులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2 లక్షలు మంజూరు చేయించారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు మంగళవారం బాలుడి తండ్రి రాపూరి వినోద్‌కు రూ.2 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి సీఎం చంద్రబాబు నాయుడు తన సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నారు. కార్యక్రమంలో 15వ వార్డు అధ్యక్షులు మాతంగి రవి కిరణ్, బుల్లా పిచ్చయ్య, కొదమల సురేష్ (సైమన్), బుల్లా రాము, రావూరి విజయ్ నంద్ పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తాడికొండ

టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని స్థానిక శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం లో భాగంగా మంగళవారం తాడికొండలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. 5, 6,13 వార్డులలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వై.వి .హనుమంతరావు ,నూతక్కి నవీన్ కుమార్ ,షేక్ బాబు, బండ్లమూడి లింగయ్య గ్రామస్తులు పాల్గన్నారు.

జర్నలిస్టుకు హెల్త్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు

సమాజ శ్రేయస్సు కోసం పనిచేసే పాత్రికేయులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండాలని ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో పొన్నూరు ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఎమ్‌డి షరీఫ్ అధ్యక్షతన పొన్నూరు పట్టణం ఏపీజే అబ్దుల్ కలాం షాదీ ఖానా లో లలిత హాస్పిటల్ వారి ద్వారా 35 మంది జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. ముఖ్య అతిధిగా మండలం తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హాక్ మరియు పట్టణ సి ఐ యల్. వీర నాయక్ పాల్గొన్నారు. తాసిల్దార్ మరియు సిఐ మాట్లాడుతూ లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు అందించిన ఈ హెల్త్ కార్డులు జర్నలిస్టులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సభ్యులు ఈ హెల్త్ కార్డుల ద్వారా రాయితీతో కూడిన వైద్యం చేయించుకునే అవకాశం ఉందని తెలిపారు . ఏపీడబ్ల్యూజే గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎస్ఎన్ మీరా మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను గుర్తించి వారికి హెల్త్ కార్డులు మంజూరు చేసిన లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యానికి, డాక్టర్ లలిత ,డాక్టర్ రాఘవ శర్మ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

పరికరాల మంజూరుకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - తుళ్లూరు

గుంటూరు జిల్లా సర్వశిక్షా ఆధ్వర్యంలో %శీ%-18 ఏళ్ల దివ్యాంగులు ఉచితంగా ఉపకరణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక భవిత కేంద్ర విద్యాలయ టీచర్లు ఆర్ ఉషారాణి,కె దేవీ ప్రియ మంగళవారం తెలిపారు.తాడికొండలో ఆగస్టు 2న ఉదయం గం 9 ల నుంచి మధ్యాహ్నం గం 2 వరకు మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.వీల్ చైర్స్ , ట్రై సైకిల్స్ , వాకర్స్ ,చెవిటి మిషన్స్, యుడిఐడి కార్డ్ అవసరమైన వాళ్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ ,కాస్ట్ సర్టిఫికెట్ ,ఇన్కమ్ సర్టిఫికెట్, రెండు పాస్ ఫోటో సైజ్ ఫోటోలను జిరాక్స్ తీసుకొని క్యాంపుకు హాజరు కావాలని వారు తెలిపారు.

సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి బందారపు యశ్వంత్ రఘువీర్ డిమాండ్ చేశారు. మంగళవారం మంగళగిరిలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఆయన, విద్యార్థులకు తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, నాణ్యమైన ఆహారం, ట్రంకు పెట్టెలు, పుస్తకాలు, దుప్పట్లు, దోమతెరలు సకాలంలో అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్స్ చార్జీలను విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తగిన చర్యలు లేకపోతే విద్యార్థులతో కలిసి ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, విద్యార్థులు పాల్గన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు

ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. గుంటూరులో ని తాడికొండ నియోజక వర్గ టిడిపి కార్యాలయంలో చెక్కుల పంపిణీ జరిగింది.రూ 1 కోటి 6లక్షల 29వేల 896 రూపాయల చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

వట్టిచెరుకూరు బిసి హాస్టల్‌లో పరిశీలన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజక వర్గంలోని వట్టి చెరుకూరు మండల బీసీ హాస్టల్ ను గుంటూరు జిల్లా వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్ది విభాగం అధ్యక్షులు చిన్న బత్తిన వినోద్ మంగళ వారం పరిశీలించారు. అనంతరం హాస్టల్ లో వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ హాస్టల్ లో బాత్రూం సరైన వసతులు కూడా లేవని హాస్టల్ కి పర్మినెంట్ వార్డెన్ ను కూడా లేరని అనపర్తి వార్డెన్ ప్రస్తుతం ఇంచార్జ్ గా ఉన్నారని నైట్ వాచ్ మెన్ కూడా లేరని తెలిపారు. అనంతరం విద్యార్ధులతో మాట్లాడారు. హాస్టల్ వసతుల లేకపోవడం మరింత సమాచారం సేకరణ చేసి ఆగస్టు ఒకటవ తేదీ కలెక్టరేట్ ముట్టడించి కలెక్టర్‌కి వినతి పత్రం ఇస్తామని తెలిపారు. కార్యక్రమం లో జిల్లా అధికార ప్రతినిధి నాదెండ్ల రామ చంద్రయ్య,కుర్నుతల సర్పంచ్ గోపాల కఅష్ణ,వట్టి చెరుకూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - పెదకాకాని



షేక్ నజియా

మండల పరిధిలోని నంబూరు గ్రామానికి చెందిన షేక్ నజియా అనే మహిళ ఈనెల 12వ తేదీన ఆమె బంధువులకు డబ్బులు ఇవ్వడానికి వెళు_న్నానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులను విచారించిన ఆచూకీ తెలియక పోవటంతో భర్త షేక్ ఫారుక్ మంగళవారం పెదకాకానిక్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలియజేశారు. చిత్రంలో ఉన్న మహిళ ఆ చూకీ తెలిస్తే పెదకాకాని పోలీసులను సంప్రదిం చాలని వారు కోరారు.

మద్యాన్ని దాచిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - తాడికొండ

అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తాడికొండ ఎస్ఐ జీత్యా నాయక్ తెలిపారు. మంగళవారం తాడికొండ అడ్డరోడ్డు వద్ద గస్తీ నిర్వహిస్తుండగా తుళ్లూరు మండలం పెద్ద పరిమి గ్రామానికి చెందిన కటేవరపు తిరుపతిరావు రెండు కూలింగ్ వాటర్ క్యాన్లు కలిగి అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని గమనించిన ఎస్సై వాటర్ క్యాన్లను పరిశీలించారు. అందులో 49 మద్యం బాటిల్స్ కనిపించాయి. తిరుపతిరావును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీత్యా నాయక్ తెలిపారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్వోసీ చెక్కులను స్థానిక టీడీపీ నాయకులతో కలసి తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు బాధితులకు మంగళవారం అందజేశారు. టీడీపీ నాయకులు ఇట్టాభాస్కర్, కొర్రపాటి విజయ్‌కుమార్, గాజుల క్రిష్ణా, గాడి సాంబశివరావు, సంక్రాంతి అశోక్, సంక్రాంతి వేంకటపతి, కోడి పిల్లల శ్రీష్ణ. బక్కలావణ్య, ఎం.సుజాత, లక్ష్మి, పాల్గొన్నారు.

కార్మికులంతా ఏకం కావాలి : సిపిఐ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఏకం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సిపిఐ కొమెర వీరాస్వామి భవన్‌లో మంగళవారం కేతావత్ రంగ నాయకులు, షేక్ సైదా అధ్యక్షతన జరిగిన మాచర్ల ఏరియా 16వ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడారు. గుంటూరు, పల్నాడు జిల్లాల కార్య దర్శులు జంగాల అజయ్‌కుమార్, మారుతి వర ప్రసాదరావు జిల్లా సహాయ కార్యదర్శులు రాం బాబు, షేక్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాము, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వెంకట్రావు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రంగస్వామి, మాచర్ల, దుర్గి మండలాల కార్య దర్శులు ఎం.బాబురావు, శివయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరవిందబాబుకు సన్మానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సభాపతి అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన శాసనసభ, శాసనమండలి సంయుక్త ఆధ్వ ర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన, ఏపీ బీసీ సంక్షేమ కమిటీలో, కమిటీ మెంబర్ ఎన్నికైన నరసరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును నరసరావు పేట నియోజకవర్గ టిడిపి కార్యాలయం లో మంగళవారం ఏపి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను ఆధ్వర్యం లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబను సత్కరించారు. బి.శ్రీను మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఉన్న బిసి కులాల జీవన విధానం గురించి ఎమ్మెల్యే అరవింద బాబుకు వివరించారు. బిసి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించా లని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ రాంప్రసాద్, బిసి సెల్ పట్టణ అధ్యక్షులు మడక శివప్రసాద్, మండల అధ్యక్షులు గురు ఆంజనే యులు, యువజన అధ్యక్షులు సుతారం విశ్వేశ్వర రావు, బిసి నాయకులు ఫణిదం బోసు బాబు పాల్గొన్నారు

తొలి టిక్కెట్ పసుపు రైతుకు

ప్రజాశక్తి - దుగ్గిరాల

నూతనంగా నిర్మించిన దుగ్గిరాల రైల్వే స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుండి విజయవాడ తెనాలి నుండి తరలి వచ్చిన దాదాపు 100 మంది అధికారులు, సాంకేతిక సిబ్బంది కొత్త స్టేషన్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి టికెట్ నంద్యాలకు చెందిన రైతు ఎం. సుబ్బారాయుడు కొనుగోలు చేశారు. దుగ్గిరాల పసుపుయార్డుకు వచ్చి పసుపు అమ్ముకొని విజయవాడ వెళ్లి అక్కడ నుండి నంద్యాల వెళ్లే క్రమంలో విజయవాడ వరకు ఈ టికెట్టును కొనుగోలు చేశారు. అనంతరం 137 సంవత్సరాల నాటి పాత రైల్వే స్టేషన్‌ను పగులుగొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయవాడ, తెనాలి నుండి వచ్చిన అధికార బృందం, టెక్నీషియన్లు ఒక్కరోజులోనే ఆధునిక సాంకేతికతో ప్రారంభించిన కొత్తస్టేషన్ చూపరులను ఆకట్టుకుంటోంది కార్యక్రమంలో డివిజనల్ ఆపరేటింగ్ మేనేజర్ సోమశేఖర్ది ఏడి ఎస్టీ ఈ.బ్రహ్మజీరావు, స్టేషన్ సూపరిం టెండెంట్ టి.శ్రీనివాసరావు, జానీబాష పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మేడికొండూరు సిఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ పాల్గొని మాట్లాడారు. కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కళాశాల పరిషత్ ప్రాంతాల్లో సిసి కెమెరాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలను నిషేధించాలని అన్నారు. మత్తు పదార్థాల సమాచారం తెలిసిన వ్యక్తులు పోలీసులకు వెంటనే సమాచారం తెలపాలని అన్నారు. పదార్థాలు చట్టవిరోధమని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటైనా విద్యార్థులపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సిఐ నాగూర్ మీరా సాహెబ్ అనంతరం యాంటీ డ్రగ్ యాంటీ ర్యాగింగ్‌పై ప్రత్యేక ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టాప్ -5 ర్యాంకులో మాచర్ల నియోజకవర్గం

ప్రజాశక్తి - మాచర్ల

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు జూలై 2న రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ మొదలు పెట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గం స్టేట్ ర్యాంకును కైవసం చేసుకుంది. 175 నియోజకవర్గాల్లో అధిష్టానం నిర్వహించిన సర్వేలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి కనపర్చిన ప్రతిభకు పార్టీ అధిష్టానం మాచర్ల నియోజకవర్గానికి స్టేట్ టాప్-5 ర్యాంకు ను కేటాయిస్తూ ప్రశం సించింది. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం, రాష్ట్రస్థాయిలో మాచర్ల నియోజక వర్గాన్ని టాప్ -5 లో నిలిపేందుకు పాటుపడ్డ ప్రతిఒక్క కార్యకర్తకు ఈ ఘనత అంకితమని ఎమ్మెల్యే జూలకంటి ప్రశంసించారు. ప్రభుత్వానికి, ప్రజలకు టీడీపీ శ్రేణులు వారధిగా నిలిచారని, టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్‌లకు, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే అభినందించారు.

ప్రయాణికురాలికి బ్యాగ్ అప్పగింత

ప్రజాశక్తి - తెనాలి

రైల్లో మరచిపోయిన బ్యాగ్‌ను రైల్వే పోలీసులు ప్రయాణీకురాలికి అప్పగించారు. జీఆర్‌పి ఎస్ఐ వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన నాట్యాచారిణి బి.రంగనాయకి సోమవారం రాత్రి సికింద్రాబాద్ నుంచి తెనాలికి సింహపురి ఎక్స్ప్రెస్ లో వచ్చారు. రైలు దిగే క్రమంలో తన లగేజ్ బ్యాగ్‌ను మర్చిపోయారు. గుర్తుకు వచ్చిన వెంటనే ఆమె రైల్వే పోలీసులను సంప్రదించి విషయం తెలియజేయడంతో డ్యూటీలో ఉన్న ఆర్పిఎఫ్ స్టాఫ్ ద్వారా బ్యాగ్ స్వాధీనం చేసుకుని ఆమెకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.



ఫోన్ మాట్లాడుతూ బండి నడిపితే కఠిన చర్యలు

పల్నాడు జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


ఏ మాత్రమూ భద్రత ప్రమాణాలు పాటించకుండా వాహనాలు నడపడం, ప్రధానంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్.పి కె.శ్రీనివాసరావు ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎస్.పి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో వాటిల్లిన రోడ్డు ప్రమాదాల నివేదికలు పరిశీలించి ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గుర్తించిన బ్లాక్ స్పాట్లలో సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ, రవాణా, ఆర్‌అండ్‌బి, నేషనల్ హైవేస్, ఆరోగ్య శాఖలు పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని, ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చూడాలని, యూ టర్న్ దగ్గర సైన్ బోర్డులు, రేడియం స్టిక్కర్లు పెట్టించాలని చెప్పారు. మండల కేంద్రం రొంపిచర్ల పరిధిలో పలు గ్రామాలలో విస్తరించి ఉన్న అద్దంకి - నార్కెట్ పల్లి జాతీయ రహదారిపై ప్రమాదాలు వాటిల్లుతున్నాయని, విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఎన్.ఏ.ఎం హైవే పై ఫ్లైఓవర్ నిర్మాణానికి అవకాశాలను పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం నోడల్ అధికారి ఇ-డిఏఆర్ యాప్ పైన అవగాహన కల్పించారు. జిల్లా రవాణా శాఖ అధికారి వి.సంజీవ కుమార్, ఆర్.అండ్‌బి ఈఈ, ఆర్టీసీ ఆర్.ఎం, ఎన్.హెచ్.ఐ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి హాట్‌స్పాట్‌లపై నిఘా

మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్.పి కె.శ్రీనివాసరావు సూచించారు. దీనిపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించగా అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ఎస్పీ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన గంజాయి హాట్‌స్పాట్‌లపై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మాదక ద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల్లోని ఉన్న అనుమానిత వ్యక్తుల నివాస ప్రాంతాలను అధికారులు తనిఖీ చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో అసంపూర్తిగా నిర్మించిన భవనాలు, ఖాళీగా వదిలివేసిన భవనాల్లో కార్యకలాపాలపై నిఘా ఉంచాలని చెప్పారు. పిట్ ఎన్.డి.పి.ఎస్ చట్టం కింద ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదై, ఎక్కువ మొత్తంలో గంజాయి సరఫరా చేస్తూ లేదా అమ్ముతూ దొరికిన వారి ఆస్తులు జప్తు చేస్తామన్నారు. పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయాల వరకు అన్ని విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. డీ-అడిక్షన్ సెంటర్లు పునరావాస సహాయం కోసం అవుట్ రీచ్ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఏరియా హాస్పిటల్ లో ఉన్న డీ-అడిక్షన్ సెంటర్ కొత్తగా ఏర్పాటైన డీ-అడిక్షన్ సెంటర్లో అవసరమైన సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. మాత జ్ఞానమ్మ డీ-అడిక్షన్ సెంటర్‌ను సైకియాట్రిస్ట్ కనీసం నెలకు రెండుసార్లు సెంటర్‌కు వచ్చిన వారిని పరీక్షించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.రవీంద్ర, జిల్లా వైద్య - ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.ప్రసూన, సైకియాట్రిస్ట్ జిపి ఎస్ రాజు, డిఈఓ కార్యాలయ ఎడి కెఎంఏ హుస్సేన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా 3న సదస్సు

- 5న విద్యుత్ కార్యాలయం, సచివాలయాల వద్ద ధర్నాలు
- పలు ప్రాంతాల్లో ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రచారం, సంతకాల సేకరణ





చిలకలూరిపేట, అమరావతిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వినియోగదారులకు అదాని స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా రూ.1.20 లక్షల కోట్ల వ్యాపారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక పదో వార్డు గుర్రాలచావిడి ప్రాంతంలో మంగళవారం ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ప్రారంభమైన స్మార్ట్‌మీటర్లను ప్రతిపక్షంలో ఉండగా టిడిపి వ్యతిరేకించిందని, తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామంటూ ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ మీటర్లను పెడితే ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి ఇలా... వేర్వేరు సమయాల్లో వేర్వేరు ధరల అమలు ద్వారా ప్రజలపై భారీగా భారాలు వేస్తారని చెప్పారు. విద్యుత్ కావాలంటే ముందుగానే రీఛార్జి చేసుకోవాల్సి వస్తుందని, లేకుంటే విద్యుత్ సరఫరా వెంటనే నిలిచిపోతుందని తెలిపారు. పలు రాష్ట్రాల్లో ఈ స్మార్ట్ మీటర్లపై వ్యతిరేకత రావడంతో ఏర్పాటును నిలిపేశారని, మనరాష్ట్రంలోనూ నిలిపేయాలని కోరారు. బలవంతంగా ఏర్పాటు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ పేదల కష్టాన్ని విద్యుత్ బిల్లుల రూపంలో అదానీకి కట్టబెట్టడానికి ప్రభుత్వాలు సిద్ధమయ్యాయన్నారు. దీనికి వ్యతిరేకంగా 3వ తేదీన పండరిపురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని, 5న విద్యుత్ ప్రధాన కార్యాలయం, సచివాలయాల వద్ద ధర్నాల్లో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎస్‌కె.అల్లాభక్షు, పి.వెంకటేశ్వర్లు, ఎస్.లూథర్, ఫైరోజ్ పాల్గొన్నారు.


బెదిరించి పెట్టారు..

స్మార్ట్ మీటరు బిగించవద్దని తాము ఎంతచెప్పినా వినకుండా ఏర్పాటు చేశారని గుర్రాలచావిడి ప్రాంతానికి చెందిన మహిళలు వాపోయారు. మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న నాయకుల ఎదుట తమ ఆవేదనను వెలిబుచ్చారు. మీటరు బిగించకుండా అడ్డుపడితే కరెంట్ కనెక్షన్ తీసేస్తామన్నారని, మళ్లీ విద్యుత్ కనెక్షన్ కావాలంటే అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి ఉంటుందని బెదిరించారని తెలిపారు. ముందే రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుందనే విషయం వారు చెప్పలేదన్నారు. కూలీనాలి చేసుకుని బతికే తమకు పాతమీటర్లనే ఉంచాలని కోరారు.

ప్రజాశక్తి - అమరావతి

విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మండల కేంద్రమైన అమరావతిలోని బాబూజగ్జీవన్‌రామ్ కాలనీలో సిపిఎం నాయకులు మంగళవారం ప్రచారం చేశారు. మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ అదానీ కంపెనీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ప్రజలపై భారాలు మరింత పెరుగుతాయన్నారు. మీటరుకు అయ్యే ఖర్చును ప్రజల నుండే వసూలు చేస్తారని చెప్పారు. విద్యుత్ ప్రైవేటీకరణకు సైతం దారితీసే ఈ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా 5న విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో చేసే ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'కృష్ణవేణి' విద్యార్థినుల ప్రతిభ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మొదటి ఏడాది 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో నరసరావుపేటలోని కృష్ణవేణి మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు వర్సిటీ స్థాయిలో ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. బిసిఎలో పి.కీర్తన (793/850), కె.నీరజ (792/850), బిఎస్సీ (సిఎస్, ఫిజిక్స్)లో కె.భవ్య సాహితి (774/850), బిఎస్సి (సిఎస్, స్టాటిస్టిక్)లో కె.అఖిల (773/850), బి.కామ్ కంప్యూటర్‌లో వై.లక్ష్మీ తిరుపతమ్మ (696/800) మంచి మార్కులు సాధించారని చెప్పారు. కళాశాలలో అన్ని గ్రూపులలో అత్యధిక శాతం పాస్ పర్సంటేజ్ పెరిగిందన్నారు.

30 లోగా లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి-సత్తెనపల్లి: జూన్ 30 కి ముందు ప్లాటుగా రిజిస్ట్రేషన్ కాబడిన అన్ని లేఅవుట్లు రెగ్యులైజేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అనుమతిలేని లే అవుట్ యజమానులు, డెవలపర్స్, ప్లాట్ల అమ్మకము/కొనుగోలుదారులకు, ప్రజలందరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు 10 శాతం ఓపెన్ సెస్ లేదా 14 శాతం ఓపెన్ సెస్ చార్జీలను పీనలైజేషన్ చార్జీలతో సహా చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. జీవో జారీ చేసిన తేదీ 26-7-2025 తేదీ నుండి 90 రోజుల లోపు క్రమబద్ధీకరణకు https:/ /lrsdtcp.ap.gov.in ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



ఆరుగురు విద్యార్థులు దత్తత

ప్రజాశక్తి - పెదకూరపాడు

పి4లో భాగంగా ఆరుగురు విద్యార్థులను తాళ్లూరు సొసైటీ చైర్ పర్సన్ ఏటుకూరి రత్నకుమార్ దత్తత తీసుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యే ప్రవీణ్ కార్యాలయంలో ఆయన సమక్షంలో జలాల్పురం గ్రామానికి చెందిన శిరీష, నీలిమ పెదకూరపాడుకు చెందిన సుష్మ, మణికంఠ, కంభంపాడు గ్రామానికి చెందిన ప్రదీప్, హర్షవర్ధన్‌ను తీసుకున్నారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ ఇలాంటి వారి స్ఫూర్తితో మరికొంత మంది విద్యార్థులను దత్తత తీసుకుని వారి భవిష్యత్తుకు అండగా నిలవాలని కోరారు.



లింగాపురం పాఠశాలల్లో డిఇఒ పరిశీలన

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని లింగాపురం మోడల్ ప్రాథమిక పాఠశాల, జెడ్‌పి పాఠశాలను పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం సందర్శించారు. నిర్దేశించిన విధంగా సిలబస్ పూర్తి చేయాలని, పదో తరగతి విద్యార్థులంతా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలోని రైసింగ్ స్టార్స్ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణగా మెలగాలని, శ్రద్ధగా చదవాలని చెప్పారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

కరాటే పోటీల్లో ఎస్‌ఎస్‌ఎన్ విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

10వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని ఎస్.ఎస్.ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్ సుధీర్ మంగళవారం తెలిపారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో కృష్ణా జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ లోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన 10వ జాతీయ ఓపెన్ జూనియర్, సీనియర్ క్యోరుగి-పూమ్సే తైక్వాండో పోటీల్లో తమ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం నర్సింగ్ విద్యార్థిని వి.తులసి తన్మయ్ క్యాంస పథకం, ఎంపిసి విద్యార్థి ఎం.సాయి శ్రీకర్ 73 కేజీల కేటగిరి అండర్ -17 విభాగంలో 2 కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. వీరిని కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రెటరి అండ్ కరెస్పాండెంట్, నరసరావుపేట మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బారాయగుప్త, జాయింట్ సెక్రెటరి వూటుకూరి వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూదనరావు, నర్సింగ్ ఇన్‌ఛార్జి ఎవిఎన్ గుప్త అభినందించారు.



పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న యాజమాన్యం

స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదనందిపాడు

స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ వెంటనే నిలిపివేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం పెదనందిపాడు, కాకుమాను మండలాల్లోని నాగులపాడు, పెదనందిపాడు, కొమ్మూరు, పెద్దివారిపాలెం, గార్లపాడు గ్రామాలలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని, ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల భారాన్ని రద్దు చేయాలని, ఇప్పటికే అదనంగా వసూలు చేసిన 2,787 కోట్ల రూపాయలను వినియోగదారులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రజలు భారీ స్థాయిలో విద్యుత్ భారాలను మోస్తున్నారని, కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు

భారాలను తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని పిలుపునిచ్చారని తెలిపారు. ప్రస్తుతం తమ ఏడాది పాలనా కాలంలో విద్యుత్ చార్జీల భారం తగ్గకపోగా మరింత పెరిగిందని, స్మార్ట్ మీటర్లను ఆఫీసులకు, వ్యాపార సంస్థలకు బిగించారని తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఇంటికి బిగించేందుకు ఆదాని కంపెనీ వ్యక్తులు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని, ముందుగా రీఛార్జి చేసుకుంటేనే కరెంటు వస్తుందని, మీటర్‌కు అయ్యే ఖర్చు ప్రజల మీద నెలవారీగా బిల్లులు వేసి వసూలు చేస్తారని తెలిపారు. సాధారణ సమయాల్లో ఒక రేటు, మనం ఎక్కువగా కరెంటు వాడుకునే సమయంలో అదనపు రేటు వసూలు చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ మొత్తం ఆదాని కంపెనీకి అప్పగించేందుకు జరిగే సన్నాహాల్లో భాగంగా ఇదంతా జరుగు తుందని, దీని ఫలితంగా వ్యవసాయ దారులకు, ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగ దారులకు ప్రస్తుతం ఇచ్చే ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని పేర్కొన్నారు. సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ ఈరోజు పలు గ్రామాల్లో కర పత్రాల ప్రచారం, సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 5వ తేదీన పెదనందిపాడు విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో ప్రజల పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

ప్రజాశక్తి- తాడేపల్లి

ఆదాని కంపెనీ లోపాల కోసం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్లను ప్రజానీకం వ్యతిరేకించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మేక అమరా రెడ్డి భవన్లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాడు పెంచిన చార్జీలు వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోక మరింత బాధడు మొదలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పెట్టారని విమర్శించారు. ప్రస్తుత మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని నాడు పిలుపునిచ్చిన సంఘటన ఒకసారి గుర్తు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై పెద్ద ఎత్తున విద్యుత్ భారాలు మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు బిగింపుకు వ్యతిరేకంగా ప్రజానీకం ఊరువాడ కదలాలని కోరారు. సిపిఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీ విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు పల్లె కృష్ణ, డి.వి. విజయభాస్కర్ రెడ్డి, నీరుడు దుర్గారావు, తుడిమెళ్ళ వెంకటయ్య పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

3న కెవిపిఎస్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కెవిపిఎస్ జిల్లా 6వ మహాసభలు సందర్భంగా వచ్చేనెల 3వ తేదీన జరిగే సదస్సును జయప్రదం చేయాలని మంగళవారం ఆత్మకూరులో నాయకులు ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. 3వ తేదీ మూడు గంటలకు మంగళగిరి టిప్పర్ల బజార్ లోని ముజఫర్ అహ్మద్ భవన్ లో "కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక న్యాయం" అనే అంశంపై జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం అజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితుల మీద ఏ విధంగా వివక్షత ఉందో సాక్షాత్తు డిప్యూటీ సీఎం నియోజకవర్గంలో సామాజిక బహిష్కరణలు.. తెనాలిలో ఐతానగర్‌లో దళిత యువకుల మీద పోలీసుల దాష్టీకం అద్దంపడుతోందన్నారు. అణగారిన వర్గాల ఐక్యత కోసం జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు దుర్గారావు, గడ్డం పౌలు రాజు, చింతలచెరువు దాసు, కొండేటి ఏసుమణి, పచ్చిగళ్ళ నాగేశ్వరావు, మరియమ్మ, ప్రసన్న కుమారి, జోజిమేరీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవీపిఎస్) గుంటూరు జిల్లా 6వ మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు - సామాజిక న్యాయం " అంశం పై జరిగే సదస్సును జయప్రదం చేయాలని స్థానిక క్రిస్టియన్ పేటలో మంగళవారం ఇంటింటి ప్రచారం జరిగింది. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు బురుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రైస్తవుల మీద, దళితుల మీద మైనారిటీలపై దాడులు అధికం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు- సామాజిక న్యాయం అంశం పై జరిగే ఈ సదస్సులో దళిత క్రైస్తవ మైనారిటీ యువతి యువకులు, విద్యావంతులు పెద్దయెత్తున పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు వై.బర్నబస్, మేరీ, కమలాకర్, నవీన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటమే

ప్రజాశక్తి - దుగ్గిరాల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినది అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కాలేదు, తగిన శ్రద్ధ చూపించడం లేదు, సమస్య పరిష్కారం కాకపోతే పోరాటం తప్పదని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎవిఎన్ కుమారి అన్నారు. మండలంలోని ఈ మని గ్రామంలో మంగళవారం జరిగిన అంగన్‌వాడీల సమావేశంలో ఆమె మాట్లాడారు . అంగన్‌వాడీలు 2024లో 42 రోజులు సమ్మె చేసి ప్రభుత్వంతో రాతపూర్వక ఒప్పందం చేసుకున్న ప్పటికీ ఏడాది గడిచిన అమలు కాలేదు అన్నారు. ప్రభుత్వ యాప్లతోనే అంగన్వాడీలకు సమయం సరిపోతుందని పిల్లలకు చదువు ఆటపాటలు నేర్పేందుకు సమయం సరిపోవటం లేదన్నారు. ప్రభుత్వ ఫోన్లు 90 శాతం పనిచేయటం లేదని విమర్శించారు. నిత్యావసర



మాట్లాడుతునన యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎ.వి.ఎన్.కుమారి

వస్తువుల ధరలు పెరుగుతున్నప్పటికీ మెనూ ఛార్జీలు పెరగటం లేదన్నారు. అంగన్‌వాడీలకు టిఎ, డిఏలు ఇచ్చేందుకు జీవో ఇచ్చినప్పటికీ అమలు కాలేదు అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వై.నేతాజీ, మండల అధ్యక్షుడు జెట్టి బాలరాజు, అంగన్‌వాడీ యూనియన్ మండల నాయకులు జయ, ఎం.వి.లక్ష్మి సునీత, మీనా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

లంక భూముల్లో అక్రమాలపై చర్యలు తీసుకోండి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన దొండపాడు ఎస్‌పి కాలనీ వాసులు

ప్రజాశక్తి - తుళ్లూరు

లంక భూముల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని దొండపాడు ఎస్సి కాలనీ వాసులు తహశీల్దార్ ఎం.హరిబాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దొండపాడు క్రిస్టియన్ టెనెంట్‌లు కో- ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో రాయపూడి రెవెన్యూలో దొండపాడు లంకలో 40 ఎకరాల లంక భూములున్నాయని చెప్పారు. సదరు భూమిని



వినతిపత్రం అందజేస్తున్న దొండపాడు ఎస్‌సి కాలనీ వాసులు

కౌలుకు ఇవ్వగా వచ్చిన సొమ్ముతో చర్చి పండుగలు ఇతరత్రా కార్యక్రమాలు నిర్వర్తిస్తూ వస్తున్నామని తెలిపారు. రాజధాని నేపథ్యంలో భూముల ధరలు పెరగడంతో కొంతమంది క్రిస్టియన్ ఆర్‌సిఎం చర్చి సభ్యులు స్వార్థ ప్రయోజనాల కోసం బయటి వ్యక్తులతో కలిసి పలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమిని కబ్జా చేసి సంఘంలో ఉన్న కొంతమంది సభ్యుల పేర్లు తొలగించి తనకిష్టమైన వారి పేర్లను రెవెన్యూ రికార్డులలో చేర్పించే ప్రయత్నం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను కోరారు. తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని హరిబాబును పూలమా లలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

క్లాప్ ఆటో డ్రైవర్లను ఆపడం అన్యాయం

ప్రజాశక్తి - మంగళగిరి

విధులకు క్లాప్ ఆటోడ్రైవర్లను ఆపడం అన్యాయమని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్ల విస్తృత సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో



మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి బాలాజీ

మంగళవారం జరిగింది. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.చెంగయ్య, కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు మంగళవారం విధులకు హాజరవుగా కార్పొరేషన్ అధికారులు ఆగాలని చెప్పారని, దాంతో క్లాప్ ఆటో డ్రైవర్ల అందరూ ఆందోళన చెందారని తెలిపారు. అధికారులకు కాంట్రాక్టర్‌కు చర్చలు జరుగుతున్నందున కార్మికులు ఆందోళన పడవద్దని, ఉద్యోగ సాధన కోసం ఉమ్మడిగా కలిసి పోరాటం చేద్దామన్నారు. కాంట్రాక్టర్ నుండి కార్మికులకు రావాల్సిన ఈపీఎఫ్ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్‌ని తొలగిస్తే కార్పొరేషన్‌లోని వాహనాలకు తిరిగి క్లాప్ ఆటో డ్రైవర్లనే డ్రైవర్లుగా తీసుకోవాలని కోరారు. కార్మికులు దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో క్లాప్ ఆటో డ్రైవర్స్ నాయకులు శివ, రవి ఇతర డ్రైవర్లు పాల్గొన్నారు.

అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ గడువు పెంపు

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ పరిధిలో అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబర్ 24 వరకు గడువు పెంచిందని మున్సిపల్ కమిషనర్ వి.లక్ష్మీపతిరావు మంగళవారం తెలిపారు. రాష్ట్రంలో 2025 జూన్ 30 తేదీకి ముందు ఏర్పడిన లేఔట్లు ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో ద్వారా క్రమబద్ధీకరించుకోవచ్చునని చెప్పారు. నిర్ణీత అపరాధ రుసుముతో పాటు 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించిన వారు ఈ పథకానికి అర్హులుగా చెప్పారు. అనుమతి పొందిన లైసెన్స్ సర్వేయర్ ద్వారా కానీ, లైసెన్స్ ఇంజనీర్లు, స్ట్రక్చర్ ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్ ద్వారా కానీ అనధికార లేఔట్ లోని స్థలం ప్లాన్ తయారు చేయించి అపరాధ రుసుంలో 50% కానీ, రూ.10 వేలకు తగ్గకుండా కాని చెల్లించి తగిన పత్రాలను సమర్పించి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు టౌన్ ప్లానింగ్ విభాగంలో సంప్రదించాల్సిందిగా కోరారు.



కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధుల అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ అభివృద్ధి ప్రాధాన్య లక్ష్యంగా, తెనాలి రోడ్డును విస్తరించేందుకు చేపట్టిన చర్యలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమీషనర్ అలీమ్ భాష సమక్షంలో టౌన్ ప్లానింగ్ అధికారుల సమన్వయంతో జరిగింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి చేనేత వ్యాపారులు, దుకాణ యజమానులు, నివాసితులు, మతపరమైన ప్రదేశాల ప్రతినిధులు, ముస్లిం స్మశానవాటిక, బాప్టిస్ట్ చర్చ్, దేవాలయాలకు చెందిన పెద్దలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఎంఎస్ఐడిసి చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళగిరి చేనేత ఉత్పత్తులు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, ఇలాంటి ప్రాంతాలను అభివృద్ధి పరచడంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని అన్నారు. సమావేశంలో టిడిపి మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ కాండ్రు శ్రీనివాసరావు, ఎంటిఎంసీ ఏసిపి అశోక్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారులు, కూటమి నాయకులు, చేనేత వ్యాపారులు, ఇతర వ్యాపార రంగాల ప్రతినిధులు, మతపెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరంగా కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

31వ తేదీలోపు పంటల బీమాను చేయించుకోవాలి



పొలంపిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - యడ్లపాడు

రైతులు తమ పైర్లకు బీమా తప్పనిసరిగా చేయించుకొని కొంతవరకు ఆర్థిక సుస్థిరత సాధించవచ్చునని మండల ఏఈ ఓ. ప్రసన్నకుమార్ తెలిపారు. మండలంలోని కారుచోల గుత్తా వారిపాలెం గ్రామాలలో పునర్వ్యవస్థీకరింపబడిన వాతా వరణాధిత పంటల బీమా పథకం, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపథకాలపై మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తుంది కార్యక్రమంలో పునర్వ్యవస్తీకరింప బడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం గురించి వివరించారు. ఏఈఓ జీవన్ నాయక్, వ్యవసాయ సహాయ కురాలు శ్రీలత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

వివిధ రకాల పైర్లు సాగు చేసే రైతులు తమ పంటలకు బీమా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి కే లక్ష్మారెడ్డి కోరారు మిట్టగుడిపాడు గోలి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి అన్నదాతలకు అవగాహన కల్పిం చారు. వాతావరణం పంటల బీమా పథకం 2025 నుంచి అమలవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఈఓ రాంబాబు నాయక్ రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రత్తి, మిరప, కంది రైతులందరు పంటలకు ఈనెల 31వ తేదీ లోపు బీమా చేయించుకోవాలని డి కష్ణయ్య కోరారు. మంగళవారం మండలంలోని గారపాడు, హుస్సేనగరం, బుచ్చయ్యపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పంటలు కనీస మద్దతు ధరలు పొందేందుకు, వడ్డీలేని రుణాలు, పంట నష్టం పరిహారం, పంటల బీమా, రైతు సంక్షే మ పథకాలు. పంట నమోదు ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు తెలిపారు. వ్యవసాయ అధికారి డి.క్రిష్ణయ్య, వ్యవసాయ విస్తరణాధికారి శివపార్వతి రైతుసేవా కేంద్ర సిబ్బంది మహేష్, సుచరిత రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని కనపర్రు అమీన్ సాహెబ్ పాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలు స్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతు సిసిఆర్సి కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పంట వేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని, పంట నష్ట పరిహారం, పంట కొనుగోలులో పంట నమోదు తప్పనిసరి అన్నారు. గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పొలం పిలుస్తోంది కార్యక్రమం మాచర్ల మండలం కొప్పునూరు గ్రామంలో జరిగింది. కార్యక్రమంలో మాచర్ల మండల వ్యవసాయాధికారి పాప కుమారి, కోప్పునూరు గ్రామంలో రైతులతో కలిసి ప్రత్తి పంట పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో మాచర్ల వ్యవసాయ విస్తరణ అధికారి. మార్కండేయులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది తులసినాయక్, ప్రతాప్, కొప్పునూరు రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆహార భద్రత పథకం కింద రైతులకు కంది, మిరప విత్తనాలు వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల, కంకణాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ వాతావరణ పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎఇ ఓ.యేసపోబు రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో చంద్రకళ, రమేష్, పూర్ణచంద్రరావు, ఇతరులు

ఉత్తమ పిఎంశ్రీకి తాళ్లూరు జడ్పి పాఠశాల ఎంపిక

ప్రజాశక్తి - పెదకూరపాడు

జాతీయ విద్యావిధానం ఎంఈపి-2020 ఐదవ వార్షికోత్సవం సందర్భంగా భారత్ మండపం న్యూఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మాత్యులు ధర్మంద్ర ప్రధాన్ జాతికి అంకితం చేశారు. స్థానికంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్.చంద్రకళ, ఎపీసి ఆర్.రమేష్, ఎఎంవో పూర్ణచంద్రరావు మంగళవారం అంకితం చేశారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో 75 తాళ్ళూరు హైస్కూల్ ఉండటం విశేషం. ఈ సందర్భంగా డిఇవో చంద్రకళ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో నాణ్యమైన, గుణాత్మకమైన విద్య, మౌలిక సదుపాయాల కల్పనకు పీఎంశ్రీ పథకం ఎంతగానో దోహద పడుతుందని, ఇది పాఠశాలలకు ఒక వరంలాంటిదని అని అన్నారు. న్యూఢిల్లీ నుంచి ప్రసారమైన వివిధ కార్యక్రమాలను విద్యార్థులు అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వీక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసి చైర్ పర్సన్ బి.చంద్రకుమారి, మండల విద్యాశాఖ అధికారి టి.సత్య నారాయణ ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాసరెడ్డి, ఎ.ఇ. అనుముల శ్రీనివాసరెడ్డి, క్లస్టర్ సిఆర్ఎంటి శివ పాల్గొన్నారు.

మాచర్ల నూర్‌బాషా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - మాచర్ల



షేక్ సైదుఖాశిం, అధ్యక్షులు



షేక్ అన్వర్ ప్రధాన కార్యదర్శి

మాచర్ల పట్టణ నూర్‌బాషా సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరి గింది. ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ సైదుఖాశిం, ప్రధాన కార్యదర్శిగా షేక్అన్వర్అక్తర్, ట్రెజరర్‌గా షేక్‌మౌలాలి (హెూటల్), ఉపాధ్యక్షుడిగా షేక్‌మదీన్, సంయుక్త కార్యదర్శిగా చిన్న ఇమాంసా ఎన్నికయ్యారు. షేక్ నాసర్ వలి(రైస్), షేక్ సైద్ హుస్సేన్‌ను గౌరవ అధ్యక్షులుగా, షేక్ సైదు హుస్సేన్‌ను నూర్ బాష క్వాజి (నాయబ్)గా నియమించారు. గౌరవ సలహా దారులుగా షేక్ కొదాన్, షేక్ బాదన్‌భాయ్, షేక్ రషీద్, షేక్ ముర్తిజాలి సేవలందించనున్నారు. నూతన అధ్యక్షుడు షేక్ సైదుఖాశిం మాట్లాడుతూ నూతన కార్యవర్గంపై సభ్యుల చూపిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పని చేస్తామని, సభ్యుల సహకారంతో నూర్‌బాషాల ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

మున్సిపల్ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పురపాలక సంఘ కార్యాలయం ప్రాంగణంలోని కౌన్సిల్ హాల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నమస్తే కార్యక్రమంలో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు, సూపర్వైజర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పూణే నుండి ఇరువురు శిక్షకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం మేరకు మున్సిపల్ అధికారులు పని చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. పిఈఎంఎస్ఆర్ యాక్ట్ 2013 నియమ నిబంధనలు, వారు ఏ విధంగా వ్యవహరించాలో, ఎటువంటి వస్తువులు ధరించాలో అవగాహన కల్పించారు. వాటిని నివారించుటకు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరించి సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు.

ప్రజల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. నియోజకవర్గ అభివద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు టిడిపి నాయకులు హనుమంతురావు కేదార్ కోమటినేని శ్రీనివాసరావు టిడిపి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తోట అంబిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

కూటమి పాలనలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారు నాయక్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని మంగళవారం ద్వారకాపురి గ్రామంలో ఆయన నిర్వహించారు. దారు నాయక్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ఏడాది పాలన గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం పథకం, యువతకు ఉద్యోగాలు, రైతు సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాచర్ల మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుణదలా నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, ప్రశాంత్, రామయ్య, రామాంజి నాయక్, శ్రీనునాయక్



సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



నారాయణరెడ్డికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని ఆర్వీయస్ హైస్కూల్‌లో సోమవారం జన విజ్ఞాన వేదిక, లాలూదాదా సాహెబ్ సేవాసమితి ఆధ్వర్యంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి జయంతి కార్యక్రమం జరిగింది. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు తంగళ్ళ సుధాకర హరిప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీ.వీ.సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. నారాయణరెడ్డి రాసిన కావ్యల గురించి ఆయన వివరించారు. ఆయన రాసిన గజళ్ళు, ప్రపంచ పదులు పాడి వినిపించారు. బాల సాహితీ వే త్త జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి మూడు వేలకు పైగా సినిమా పాటలు రాశారన్నారు. బాలగేయలు కూడా అనేకం రాశారన్నారు. తెలుగుజాతి మనది, భారత మాతకు జేజేలు వంటి దేశభక్తి పాటలు రాసి పిల్లలకు దేశభక్తి ఉద్బోధించారు. తొలుత సి.నారాయణరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా పాఠశాల గ్రంథాలయానికి రూ.3వేల విలువైన బాల సాహిత్య గ్రంథాలు బహుకరించారు. కార్యక్రమంలో లాలూ దాదా సాహెబ్ సేవాసమితి అధ్యక్షులు షేక్ సిద్ధాంతి కరిముల్లా, ఆర్యవైశ్య కళ్యాణ మంటపం ప్రధాన కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గిరిజన ప్రజల చిరకాల స్వప్నమైన వరికిపూడి శెల ప్రాజెక్టు పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.14.82 కోట్లు కేటాయించడంపై ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనునాయక్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అడవీ శాఖకు సంబంధించిన అడ్డంకులను తొలగించేందుకు వామపక్ష, రైతు, ప్రజా సంఘాల పోరాటాలు ఫలించాయని గుర్తు చేశారు. నిధులు కేటాయించడం పట్ల కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. త్వరగా అభివృద్ధి పనులు ప్రారంభించాలని తెలిపారు.



బీమా నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏవో

పంట బీమాని నమోదు చేసుకోండి ఏవో బాలాజీ గంగాధర్

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో పంట బీమా ఇన్సూరెన్స్ కేంద్రాన్ని మంగళవారం వెల్దుర్తి వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన స్కీం కింద ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా పథకం అమలు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. ఈనెల 31 చివరి తేదీ అని ఆయన పేర్కొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో, ఎంపిపి

ఉచితంగా పత్తి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - దుర్గి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ సునీత సాయి శంకర్ 800 మంది రైతులకు ఏవో అమీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల వ్యవసాయ సిబ్బంది రైతులకు వ్యవసాయంలో మెలుకువలు, పథకాలను, బీమ ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా చెబుతున్నారని అభినందించారు. ప్రకృతి వైపరీత్యాల ద్వారా వచ్చే నష్టపోయినపుడు బీమ సౌకర్యాలను ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా ప్రచారం చేయటంలో దుర్గి మండలం ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఏవో అమీర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పత్తి మిరప కంది మొక్కజొన్న పంట లపై రైతులు ఎక్కువ శాతం బీమా చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డి సత్యప్రసాద్, విఏఏలు వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌తోటల పెంపకంపై నేడు అవగాహన

ప్రజాశక్తి-ఈపూరు

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వాల్యూ ఆయిల్, గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సును మండలంలోని ఎ ముప్పాళ్ళ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసినట్లు నరసరావుపేట ఉద్యాన శాఖాధికారి షేక్ నబిరసూల్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయుల, జిల్లా ఉద్యాన శాఖాధికారి ఐ వెంకట్రావు వాల్యూ ఆయిల్, గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.



వ్యాపారులను, ఆటోవాలాలను హెచ్చరిస్తున్న ఎస్ఐ

రోడ్లపైకి వస్తే కేసుల నమోదు : ఎస్ఐ

ప్రజాశక్తి - మాచర్ల

వ్యాపారులు ప్రధాన రహదార్ల మార్జిన్ దాటి రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని పట్టణ ఎస్ఐ వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదార్లు, కూడళ్ళ వద్ద వ్యాపారులు, ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. తోపుడు బండ్లు వారు రోడ్డు మార్జిన్ దిగి బండ్లను పెట్టుకోవాలని, రోడ్డుపైకి రాకూడదని అన్నారు. ఆటోలు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలపరా దన్నారు. పలు గ్రామాలకు వెళ్ళే ఆటోలు, ఆటో పాయింట్ల స్థలంలోనే నిలుపుదల చేయాలని సూచించారు. ద్విచక్ర వాహన దారులు రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారని, అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
బుధవారం 30 జులై 2025

మహిళ కార్మికులపై లాఠీఛార్జీకి వ్యతిరేకంగా సిఐటియు నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నెల్లూరులో మున్సిపల్ మహిళా కార్మికులపై పోలీసుల లాఠీచార్జిని నిరసిస్తూ రాజధానిలోని నవులూరులో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం పని విరామ సమయంలో ఎంటిఎంసి మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ నెల్లూరులో మహిళా మున్సిపల్ కార్మికులపై లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచ బ్యాంకు షరతులకు లొంగి ప్రభుత్వం నెల్లూరు పట్టణంలో వర్క్ౌట్ సోర్సింగ్ విధానాన్ని మున్సిపల్ కార్మికుల్లో ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ మహిళ కార్మికులపై సోమవారం నాడు పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేసి, బూటు కాళ్లతో తన్నడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. వర్క్ౌ ట్ సోర్సింగ్ విధానం అమలు జరిగితే కార్మికులకు పని భద్రత ఉండదని, ప్రయివేటు యజమానుల కింద కార్మికులు బానిసలుగా పని చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని, పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలు తొలగించబడతాయని అన్నారు. పయోగాత్మకంగా నెల్లూరులో ప్రవేశపెట్టిన ఈ వర్క్ౌట్ సోర్సింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ మహిళా కార్మికులపై నెల్లూరులో లాఠీఛార్జికి పాల్పడిన పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మహిళా కార్మికులపై పోలీసులను ఉసిగొలిపిన సిఐ శ్రీనివాసరావును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గాన్ని పోలీసు బలగాలతో అనిచి వేయాలని ప్రయత్నిస్తే కార్మిక వర్గమంతా సంఘటితమై తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.నాగమణి, రజిని, శివ నాగేంద్రం, కనకమ్మ, రాణమ్మ, మేరి, బాబు, శిరీష తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కార్మికులు


బహుమతులు అందజేస్తున్న అనురాధా నాయుడు

పరివర్తన తీసుకొచ్చేందుకే బాల న్యాయ చట్టం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భారతదేశంలో బాల నేరస్తుల న్యాయవ్యవస్థ యొక్క ప్రధాన లక్ష్యం వారిని సాధారణ నేరస్తుల వలే శిక్షించకుండా అన్ని విధాలుగా వారిని సంరక్షించే విధంగా బాల న్యాయ సంరక్షణ మరియు పోషణ చట్టాన్ని రూపొందించారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యురాలు అనురాధా నాయుడు అన్నారు. జువనైల్ జస్టిస్ అని పాఠ్యాంశంపై ఎల్.ఎల్.బి హానర్స్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాలు ప్రత్యేకత తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. అనురాధ నాయుడు మాట్లాడుతూ భారతదేశంలో 18 సంవత్సరాల కంటే తక్కువ వయసు వారు నేరాలకు పాల్పడినప్పుడు అతని విషయంలో బాల న్యాయ (బాలల సంరక్షణ, పోషణ) చట్టాన్ని అమలు చేస్తారన్నారు. ఏడు సంవత్సరాల లోపు పిల్లలు నేరాలు చేసినప్పటికీ వారిలో నేర ఉద్దేశాన్ని నిర్ధారించటం ఔచితం కాదు కాబట్టి ఆ వయసులోపు పిల్లలని నేరస్తులుగా నిర్ధారించటం లేదని చెప్పారు. యునైటెడ్ నేషన్ ఆఫ్ ది కన్వెన్షన్ ఆఫ్ ది రైట్ ఆఫ్ ది చైల్డ్(యు ఎన్ సి ఆర్ సి), నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ వంటి సంస్థల చొరవతో మనదేశంలో బాలల సంరక్షణ కోసం ఇలాంటి ఒక పటిష్ట చట్టం అమలవుతోందని అనురాధ నాయుడు చెప్పారు.

విద్యార్థులకు బహుమతులు ప్రధానం

ఈ సందర్భంగా జరిగిన పోటీల్కోల విజేతలు నిఖిల్, హర్షిత, తరుణ్‌లకు ముఖ్య అతిథి, విభాగాధిపతి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ కె.శివరాం, అభిలాష్ గోపీనాథన్, పరుచూరు కుమారి, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, చెన్నారావు పాల్గొన్నారు.

238వ రోజుకు పట్టుదలగా దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 238 రోజుకు చేరుకున్నాయి. కార్మికుల్లో రోజురోజుకు తమ బకాయిలు రాబట్టుకునేందుకు పట్టుదలతో దీక్ష శిబిరానికి వస్తున్నారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులతో శిబిరం కిటకిటలాడింది. దీక్షలకు రోజు రోజుకు ఆదరణ పెరుగుతుంది. దీక్షలలో మొలక శారద, దేరంగుల రమణమ్మ, డి.సువర్ణకుమారి, బత్తుల భూలక్ష్మి, ఉప్పుకాసమ్మలు కూర్చున్నారు. దీక్షలను సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేములదుర్గారావు, సిపిఎం నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు కె.స్టీవెన్, ఆదినారాయణ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులు చేస్తున్న దీక్షలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో 300 కుటుంబాలతో ముడిపడి ఉన్న అతిపెద్ద సమస్యను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సుభాని, బి.సూర్యప్రకాశరావు, డి.నాగేశ్వరావు, బూరగ అంకయ్య, వై.సాంబశివరావు, వై.సుబ్బారావు, తుపాకుల నాగేశ్వరావు, రహంతుల్లా, ఇస్మాయిల్, హగ్గయ్య, పిచ్చయ్య, ఎం.ఆశీర్వాదం, పాగోలు సాంబశివరావు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

తడి, పొడి చెత్త సేకరణను పక్కాగా అమలు చేయాలి




తుమ్మల పాలెంలో చెత్త సేకరణ పరిశీలిస్తున్న సి ఈ ఓ జ్యోతి బసు, నడింపాలెంలో చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న డిపిఓ నాగ సాయి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ చేయాలని జడ్‌ప సిఈఓ జ్యోతి బసు అన్నారు. మంగళవారం తుమ్మల పాలెం గ్రామ పంచాయతీ (సుప్రీమ్ ఎల్ టి)లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామలో జరుగుతున్న చెత్త సేకరణ పక్కగా జరుగుతుందా లేదా గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు .అనంతరం స్వచ్ఛ సంపద కేంద్రాల వద్దకు వెళ్ళి వర్మీ కంపోస్ట్ ఎరువును పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ ఖాజా, గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా వలి ఉన్నారు.నడింపాలెం గ్రామం లో జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి నాగ సాయి పర్యటించారు చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. అలాగే గ్రామంలో కొన్ని చోట్ల రోడ్ల వెంబడి చెత్త ఉండటాన్ని గుర్తించి క్లాప్ మిత్రల చేత తీసివేంచారు. అనంతరం స్వచ్ఛ సంపద కేద్రం వద్దకు వెళ్ళి వర్మీ కంపోస్ట్ ఎరువును పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మూర్తి, క్లాప్ మిత్రలు సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్షపై కెఎల్‌యులో అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్, స్పృహాప్తి ఫౌండేషన్‌ల సంయుక్త అధ్వర్యంలో మంగళవారం లింగ వివక్ష పైన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గన్నవరంలోని ఎన్టీఆర్ వెటర్నరీ కాళాశాలకు చెందిన డాక్టర్ మస్తాన్ బి షేక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లింగ ఆధారిత వివక్ష వివిధ రూపాల్లో కొనసాగుతున్నందున, మహిళలకు, బాలికలకు సురక్షితమైన ప్రదేశాలను ఏర్పాటు చేయడం మన చేతుల్లోనే ఉందన్నారు. మహిళా సాధికారత సాదించడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. పని చేసే ప్రదేశాలలో లైంగిక వేధింపులు, ఇతర రకాల హింస నుండి రక్షించడానికి అందుబాటులో ఉన్న చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్ధి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, ఉమెన్ డెవలెఫ్ మెంట్ సెల్ కన్వీనర్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్ రమ్య, వ్యోమా సింగ్ తదితరులు పాల్గొన్నారు.





లింగ వివక్షపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మస్తాన్ బీ షేక్, బ్యాడ్మింటన్‌లో కాంస్య పతకం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్

బ్యాడ్మింటన్‌లో కెఎల్‌యు విద్యార్థుల ప్రతిభ

జర్మనీలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ 2025లో కెఎల్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభ చూపి కాంస్య పతకాన్ని సాధించినట్లు యూనివర్శిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుండి 27 వరకు జర్మనీలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో కెఎల్ యూనివర్సిటీ నుండి నలుగురు విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. తమ విద్యార్థులు బ్యాడ్మింటన్ ఈవెంట్లలో పతకాలు సాధించడం ద్వారా విశ్వవిద్యాలయానికి కీర్తి ప్రతిష్టలను తెచ్చారన్నారు. వైష్ణవి ఖడ్కేకర్ మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో ఏఆర్ రోహన్ కుమార్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

బాలికలకు ఆత్మ రక్షణపై అవగాహన

ఉమెన్ డెవలెఫ్ మెంట్ సెల్ అధ్వర్యంలో మహిళలకు, బాలికలకు ఆత్మ రక్షణ గురించి విజయవాడలోని ఎన్జీఒ, ఇసిఇ సేఫ్ టీం విభాగంతో కలిసి మహిళా అభివృద్ధి సెల్ మంగళవారం నాడు అవగాహనా సదస్సు నిర్వహించింది. విజయవాడకు చెందిన ఆత్మరక్షణ శిక్షకురాలు కీర్తిక కెఎల్ యును సందర్శించి బాలికల వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. అవగాహనా సదస్సుకు మహిళా అధ్యాపక సభ్యులు, బోధనేతర సిబ్బంది, బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ వి.లక్ష్మీపతిరావు మంగళవారం పరిశీలించారు. చెత్త సేకరణ వాహనం ద్వారా పలు ప్రాంతాలలో ఉన్న చెత్తను సేకరించే విధానాన్ని ఆయన పరిశీలించారు. అదేవిధంగా ఇంటి నుంచి చెత్త సేకరణ, పారిశుధ్య కార్మికులు అక్కడక్కడ మురుగు కాలువలలో వ్యర్థాలను తొలగిస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలను శానిటరీ ఇన్స్పెక్టర్లు, సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాల్సిందిగా ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు శానిటరీ సెక్రటరీలు ఉన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఛైర్‌పర్సన్, కమిషనర్

గంబూషియా చేపలతో దోమలకు చెక్

ప్రజాశక్తి - తెనాలి

గంబూసియా చేపలతో దోమలకు చెక్ పెట్టవద్దని ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. డెంగ్యూ మాసోత్సవాలలో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ జరిగింది. ముఖ్యఅతిథిగా ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, విశిష్ట అతిథిగా కమిషనర్ వి.లక్ష్మీపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెంగ్యూ జ్వరాలకు దోమకాటు ప్రధాన కారణమని, దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సబ్ యూనిట్ అధికారులు వివరించారు. స్థానిక చినరావూరు సత్యనారాయణ పార్కులో బోటు షికారుకు ఉపయోగించే నీటిలో దోమలను నియంత్రించేందుకు గంబూషియా చేపలను చైర్ పర్సన్ వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల లార్వాను గంబూషియా చేపలు నాశనం చేస్తాయనిచెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ నిల్వ ఉన్న నీళ్ల దోమల వృద్ధికి ఆవాసాలని, ముఖ్యంగా ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ ఏసుబాబు, సబ్ యూనిట్ అధికారులు ఎస్.ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, ఆరోగ్య సిబ్బంది కె.బాలచంద్రమౌళి, జి.రవికుమార్, మలేరియా సూపర్‌వైజర్లు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సుధీర్ బాబు

పంటలకు బీమా చేయించుకోవాలి : ఏఓ

ప్రజాశక్తి- తెనాలి రూరల్

ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద వరి, మినుము పంటలకు బీమా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి కె. సుధీర్‌బాబు తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నేలపాడు, తేలప్రోలు గ్రామాల్లో మంగళ వారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సుధీర్ మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద పెండింగులో ఉన్న అన్నదాత సుఖీభవ లిస్టులు ప్రదర్శించి నట్లు తెలిపారు. తమ బ్యాంకులు ద్వారా ఎన్పిసిఐ లింక్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో విఎఎ లు, ఎఈఓలు, రైతులు పాల్గొన్నారు.

1న జిల్లాస్థాయి మారథాన్ రెడ్‌రన్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

యువతకు హెచ్ఐవిపై అవగాహన పెంపొందించి, హెచ్ఐవి రహిత సమాజాన్ని స్థాపించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఆగస్టు 1న ఉదయం 6 గంటలకు 5 కిలోమీటర్లు పరుగుపందెం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 17 నుండి 25 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని, ప్రతి కళాశాల నుండి 5 గురు బాలికలు, 5గురు బాలురు పాల్గొనవచ్చన్నారు. గోరంట్ల వద్ద చిల్లీస్ హోటల్ వద్ద ఉదయం 6 గంటలకు రిపోర్ట్ చేయాలని, ప్రథమ బహుమతి కింద రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7వేలు ఇవ్వటం జరుగు తుందన్నారు. అంతేకాకుండా విజేతలు రాష్ట్రస్థాయిలో జరిగే మారథాన్‌కు ఎంపిక చేయబడ తారన్నారు. ఇతర వివరాలకు డాక్టర్ శాంసన్ 7382388088, డాక్టర్ జెవి.సుధీర్‌కుమార్ 98498 54221, వాసుదేవరావు 80083 14907నంబర్లలో సంప్రదించాలన్నారు.

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీకి ఎన్‌బిఎ గుర్తింపు

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజికి టైర్ వన్‌లో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సిఎస్ఈ, ఐటి, ఇసిఇ, ఈఈఈ బ్రాంచిలకు ఈ గుర్తింపు లభించిందన్నారు. కళాశాల స్థాపించిన నాటి నుండి మూడవ సారి ఇలాంటి ప్రతిష్టాత్మక ఎన్‌బిఎ గుర్తింపు దక్కిందన్నారు. కళాశాల పాటిస్తున్న ప్రమాణాలకు ఈ గుర్తింపు ఒక ఉదాహరణ అన్నారు. ఈ గుర్తింపు దక్కటంలో కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. విద్యార్థులకు విద్యతోపాటు, సాంకేతిక అంశాలు అన్నింటిలోనూ రాజీలేకుండా అత్యున్నత ప్రమాణాలతో సదుపాయాలు కల్పిస్తున్నామని, మెరుగైన ఉపాధి అకాశాలు కల్పిస్తున్నామన్నారు. జాతీయ సంస్థలతో తమ కళాశాల పొందిన ఈ గుర్తింపు తాము అందిస్తున్న అత్యున్నత విద్యాప్రమాణాలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా వారు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ కె.హరిబాబుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



నూతన ఫ్లోర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర, జిల్లా నాయకులు

ఉద్యోగుల ప్రయోజనాల సాధనలో రాజీలేదు

ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగుల ప్రయోజనాల సాధనలో రాజీపడబోమని ఎపిఎన్‌జిజిఒ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. మంగళవారం స్థానిక ఏపీ ఎన్జీజీఓ సంఘ సాంస్కృతిక సమావేశ భవన పునర్నిర్మాణ మొదటి అంతస్తు ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత రమేష్ హాస్పిటల్ నుండి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు ఘనస్వాగతం పలికి ఎన్‌జిఒ హోం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యాసాగర్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని నూతన ఫ్లోర్‌ను ప్రారంభించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో విద్యాసాగర్ మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో ఉద్యమ చరిత్రలో గుంటూరుకు చెందిన నాయకులు ముఖ్య భూమిక పోషించారని, రాష్ట్ర నాయకత్వాన్ని సైతం ప్రభావితం చేసిన నాయకులు గుంటూరు నుండి వచ్చారన్నారు. మొదటి అంతస్తు పునర్నిర్మాణం ఉద్యోగులకు సౌకర్యవంతంగా చేయించడం పట్ల జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావుకు అభినందనలు తెలుపుతూ మిగిలిన జిల్లాల్లో కూడా ఇదే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఉద్యోగులకు రావలసిన జిపిఎఫ్, ఏపీజీ.ఎల్.ఐ, సరెండర్ లీవ్ బకాయిలను కొంత మేరకు కూటమి ప్రభుత్వం చెల్లించిందని మిగతా వాటిని చెల్లింపజేసేందుకు రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి రమణ మాట్లాడుతూ ఉద్యోగ నాయకుల సమిష్టి కృషితో తాము ప్రభుత్వం నుండి ప్రయోజనాలు సాధించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగూర్ షరీఫ్, రాష్ట్ర నాయకులు సుబ్బారెడ్డి, రాంప్రసాద్, రంజిత్ నాయుడు తదితరులు మాట్లాడారు. గుంటూరు నగర అధ్యక్ష కార్యదర్శులు సూరి, కళ్యాణ కుమార్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణను శాలువలు, జ్ఞాపికలు, పుష్పమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్షులు, తాలూకా నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బర్నబాస్ హత్య కేసుతో సంబంధం లేదు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పొన్నూరులో గతంలో జరిగిన రేషన్ డీలర్ బర్నబాస్ హత్య కేసుతో తనకు సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య తెలిపారు. గుంటూరులోని తన నివాసంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో సిఐడి అధికారులు తనను విచారణకు పిలిచినట్లు, నోటీసులు ఇచ్చినట్లు టిడిపిలో కొంత మంది పనిగట్టుకుని ప్రచారం చేశారని తెలిపారు. ఈ ప్రచారం వాస్తవం కాదన్నారు. సిఐడి అధికారులు తనకు నోటీసులు ఇవ్వలేదన్నారు. నామీద బురద చల్లేవారు ఈ కేసుతో తనకు ఉన్న సంబంధం ఏమిటో నిరూపించాలన్నారు. వ్యాపార లావాదేవీల్లో వచ్చిన తేడాల వల్ల బర్నబాస్ హత్య జరిగిందన్నారు. తనకు తన కుటుంబ సభ్యులకు బర్నబాస్‌తో ఎటువంటి సంబంధాలు లేవన్నారు.

గాలి నాణ్యత పెంచేందుకు పకడ్బందీ చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు, గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలో గాలి నాణ్యతను మరింతగా పెంపొందించేందుకు జాతీయ క్లీన్ ఎయిర్ కార్యక్రమాలు సంబంధిత శాఖలు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జిఎంసి పరిధిలోని నేషనల్ క్లీన్ ఎయిర్‌ప్రోగ్రామ్ జిల్లాస్థాయి అమలు కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర కాలుష్యనియంత్రణ మండలి గుంటూరు నగరాన్ని 2011 నుండి 2015 మధ్య గాలి నాణ్యత డేటా ఆధారంగా నాన్-అటైన్‌మెంట్ నగరాల్లో ఒకటిగా గుర్తించి, గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు జాతీయ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంను రూపొందించటం జరిగిందన్నారు. రానున్న 10 సంవత్సరాల్లో గాలిలో కాలుష్యాన్ని 70 నుంచి 80 శాతం వరకు తగ్గించే లక్ష్యంతో నాన్-అటైన్‌మెంట్ నగరాల్లో కాలుష్యాన్ని తగ్గించి పచ్చదనం పెంచే కార్యక్రమాలకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా 2019-20 నుంచి 2024-25 వరకు గుంటూరు నగరానికి మొత్తంగా ఎన్‌సిఏపి కింద రూ.20.51కోట్లు మంజూరు అయ్యాయని, ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ రూ. 2.73 కోట్ల అంచనాతో ప్రతిపాదించిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జ్ కూల్చివేసి నూతన బ్రిడ్జ్ నిర్మిస్తున్న నేపథ్యంలో జీజీహెచ్ వద్ద, ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న నేషనల్ ఎయిర్ మానిటరింగ్ పోగ్రాం ద్వారా ఏర్పాటు చేసిన స్టేషన్లను ప్రత్యామ్నాయ ప్రాంతాలకు మార్చాలన్నారు. జిల్లాలో తెనాలి, పొన్నూరు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ, పశువుల వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీకి ప్లాంట్ ఏర్పాటుకు నెడ్ క్యాప్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరు ఎండీ నజీనా బేగం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (ఇన్చార్జి) చంద్రమౌని, జిఎంసి ఈఈ సుందరరామిరెడ్డి, ఎంపిఐ మల్లేశ్వరి, ఆర్టీసీ కమర్షియల్ మేనేజర్ ఆర్.వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజానాయకులు ఆళ్ల రాఘవయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన పోరాట యోధులు, సంఘ సంస్కర్త, గ్రామ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి, ఆళ్ల రాఘవయ్య విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నాగులపాడులో గ్రామ ప్రధాన కూడలిలో స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన దివంగత మాజీ సర్పంచ్ ఆళ్ల రాఘవయ్య విగ్రహాన్ని విజ్ఞాన సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, నల్లమడ రైతు సంఘ అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు, ప్రొఫెసర్ అన్నదాత మణి, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణలతో కలిసి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శారదాదేవి అధ్యక్షతన సభలో విజ్ఞాన సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఆళ్ల రాఘవయ్య ఇచ్చిన ప్రోత్సాహం తనను ఇంతటి వాడిని చేసిందన్నారు. నల్లమడ రైతు సంఘ అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజ మోహన్ రావు మాట్లాడుతు ఆళ్ల రాఘవయ్య సేవలను కొనియాడారు. ఈ ప్రాంతంలో నల్లమడ వాగుకు తరచూ వచ్చే వరదలు వల్ల రైతుల బడుతున్న ఇబ్బందులను గమనించి నల్లమడ రైతు సంఘం స్థాపించి దానికి నన్ను అధ్యక్షునిగా చేసి వారు ప్రధాన కార్యదర్శిగా ఉంటూ ప్రభుత్వం పై పోరాటం చేసి నల్లమడ వాగు అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆ రోజుల్లోనే ఈ ప్రాంతంలో వచ్చిన త్రాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఈ ప్రాంత ప్రజలను సమావేశపరిచి, అసంపూర్తిగా నిలిచిపోయిన గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించే కార్యక్రమాన్ని తిరిగి చేపట్టాలనే పోరాటానికి రాఘవయ్య శ్రీకారం చుట్టారన్నారు. అలాంటి పోరాట యోధుని విగ్రహం ఆవిష్కరించటం ఈనాటి యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆళ్ల విజయ్ కుమార్, గొల్లపూడి శ్రీనివాసరావు, కాపు వెంకట సుబ్బారావు, కొమ్మినేని నాగేశ్వరావు, బండి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు

నూతి బాపయ్య చౌదరి సేవలు ప్రశంసనీయం

నాట్స్ పూర్వ అధ్యక్షులు, పెదనందిపాడు వాస్తవ్యులు నూతి బాపయ్య చౌదరి సేవలు ప్రశంసనీయం అని సుప్రీం కోర్ట్ మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు, విజ్ఞాన సంస్థల అధినేత లావు రత్తయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు లు పేర్కొన్నారు. మంగళవారం పెదనందిపాడు లోని జిల్లా పరిషత్ హై స్కూల్లో నూతి బాపయ్య చౌదరి, మిత్రబృందం సహకారంతో రూ.13 లక్షలతో నిర్మించిన విద్యార్థుల భోజనశాలను వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను విద్యార్థులు వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పెదనందిపాడు లో విద్యారంగ వ్యాప్తికి నూతి బాపయ్య చౌదరి చేస్తున్న కృషి ప్రశంసనీయమని, తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి అందిస్తున్న సహకారాలు గొప్పవన్నారు. లావు నాగేశ్వరరావు, లావు రత్తయ్య లు మాట్లాడుతూ నాట్స్ ఆధ్వర్యంలో బాపయ్య ఈ ప్రాంతానికి చేస్తున్న సేవల పట్ల ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సభకు కాకుమాను నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాట్స్ చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్, అధ్యక్షులు మందాడి శ్రీధర్, ఉపాధ్యక్షులు భీమినేని శ్రీనివాసరావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మాదాల రాజేంద్ర పాల్గొన్నారు.



భోజనశాలను ప్రారంభిస్తున్న లావు నాగేశ్వరరావు తదితరులు

తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రానికి నాట్స్ ప్రశంసలు

ఉత్తర అమెరికా తెలుగు సంఘం నాట్స్ వారి సహకారంతో తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ నాలుగో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం సందర్భంగా, మంగళవారం నాట్స్ ప్రతినిధుల బృందం విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం వారు వారికి అభినందన సభ నిర్వహించారు. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు అధ్యక్షతన సభలో పాశం రామారావు మాట్లాడారు. విజ్ఞాన కేంద్రం పలు బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అనేక ప్రజా పోరాటాలకు వేదికగా ఉందని తెలిపారు. నాట్స్ చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్ మాట్లాడుతూ నాట్స్ సంస్థ ద్వారా రాష్ట్రంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం నిర్మించడంలో తమ వంతు పాత్ర పోషించామని తెలిపారు. విజ్ఞాన కేంద్రం కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందని తెలిపారు. నాట్స్ ఉపాధ్యక్షులు భీమినేని శ్రీనివాస్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు భీమినేని కృష్ణయ్య, మస్తానమ్మ గార్ల జ్ఞాపకార్థం విజ్ఞాన కేంద్రం లో జరిగే కుట్టు శిక్షణకు తన సహకారం అందిస్తామని తెలిపారు. నాట్స్ ప్రతినిధుల బృందాన్ని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం సభ్యులు ఘనంగా సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు